క్లుప్తంగా

ఉద్యమాలు ఉధృతం చేస్తాం



సీపీఐ జెండా ఎగురవేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఉద్యమాలు ఉధృతం చేస్తామని సీపీఐ మండల కార్యదర్శి చిరంజీవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కంచుకోట మహాసభ నిర్వహించి అనంతరం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పాలకులు మతం పేరుతో కులం పేరుతో ప్రజలను విడదీస్తూ కార్పొరేట్ల దోపిడికి వదిలేస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ మండల కార్యవర్గం సభ్యులు దివాకర్, మహేశ్, రాకేశ్, శంకర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.


విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

తిర్యాణి: విత్తనాలు, ఎరువులు నిర్ణీత ధరల కన్నా అధికంగా అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయశాఖ అధికారి వినయ్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకి తప్పనిసరిగా సరైన రశీదు ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నకిలీ విత్తనాలను అమ్మవద్దని కిరాణా దుకాణాల్లో పురుగు మందులు, ఎరువులు నిల్వ ఉంచవద్దన్నారు. కార్యక్రమంలో విత్తన డీలర్లు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఎస్పీఎం ఎదుట నిరసన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని స్టేషన్ రోడ్, సర్దార్‌బస్తీ కాలనీల్లో పేపరు మిల్లు ద్వారా వెలువడుతున్న కెమికల్స్‌తో శ్వాసకోశ, కంటి సమస్యలు వస్తున్నాయని శుక్రవారం ఎస్పీఎం గేటు ఎదుట ఆయా కాలనీలవాసులు నిరసన తెలిపారు. కొద్దిరోజులుగా రాత్రివేళ మిల్లు యాజమాన్యం కెమికల్స్‌ను గాలిలోకి విడుదల చేస్తుండడంతో చుట్టు పక్కల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మూగజీవాల కోసం తొట్టి ఏర్పాటు



తొట్టిలోని నీరు తాగుతున్న పశువు

నార్నూర్: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు మండల కేంద్రానికి చెందిన సహకార సంఘం డైరెక్టర్ దుర్గే కాంతారావు తొట్టి నిర్మించారు. తన సొంత నిధులతో తన ఇంటి ముందు నీటి తొట్టి నిర్మించి నీటి వసతి ఏర్పాటు చేశారు. దీంతో నీటితొట్టిలో నీరు తాగుతూ మూగజీవాలు తమ దాహార్తి తీర్చుకుంటున్నాయి. ఆయనను పలువురు అభినందించారు.

ఫెన్సింగ్ తొలగించి.. ప్రభుత్వ భూమి స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్గాం శివారులోని న్యూ హౌజింగ్ బోర్డుకు ఆనుకొని ఉన్న సర్వే నంబర్ 72లోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో వేసిన ఫెన్సింగ్‌ను తమ సిబ్బంది పరిశీలించి విచారణ చేపట్టారన్నారు. అజుముల్ ఖాద్రి అనే వ్యక్తి భూమి తనదిగా పేర్కొంటూ ఫెన్సింగ్ వేశారన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించగా భూమి సర్కారీ పోరంబోకు భూమిగా నమోదై ఉందన్నారు. సర్వే నంబర్ 72 ప్రభుత్వ భూమిలో ప్రవేశించరాదని, ఎలాంటి ఆక్రమణలు చేయరాదని, ఆక్రమణలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

లైంగికదాడి కేసులో యువకుడికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్‌రూరల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన యువకుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.30వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ.రమేష్ శుక్రవారం తీర్పునిచ్చారు. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంటలగూడ గ్రామానికి చెందిన సిడాం రాజు 2020లో బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. సాక్షులను విచారించగా నేరం రుజువైంది. దీంతో నిందితుడు సిడాం రాజుకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

ఫైర్‌స్టేషన్‌కు మోక్షమెప్పుడో..!

అడవుల మండలం కెరమెరిలోని అనేక గ్రామాల్లో పెంకుటిళ్లు, పూరి గుడిసెలే ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ ఎండా కాలంలో తరుచుగా అగ్నిప్రమాదాలు సంభవిస్తుంటాయి. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ఆస్తులు బుగ్గి పాలవుతున్నాయి. ఆసిఫాబాద్‌లో ఉన్న ఫైరింజన్ మండలానికి చేరే వరకు ఆలస్యమవుతుండడంతో తీవ్ర నష్టం జరుగుతోంది.

- అగ్నిమాపక కేంద్రం లేక ఆస్తులు బూడిద
- మండలంలో ఏర్పాటు చేయాలని వేడుకోలు
- గతంలో విన్నవించినా పట్టించుకోని అధికారులు



ఇటీవల కల్లెగాంలో జరిగిన అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర నష్టం జరుగుతోంది. ఆసిఫాబాద్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించినా అది మండలానికి వచ్చే సరికి ఆస్తులు బూడిదవుతున్నాయి. వెంటనే ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మండలవాసులు డిమాండ్ చేస్తున్నారు. మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల్లో ప్రతీ వేసవిలో పదుల సంఖ్యలో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే అనేక సార్లు కెరమెరిలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు నివేదించారు.

దూరంగా గ్రామాలు..



అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా నీటి విన్యాసాలు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

అటవీ సమీపంలోని గ్రామాల్లోనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. పరందోళి, అంతాపూర్, కొండిబాగూడ, లక్మాపూర్, కోటా, మహరాజ్‌గూడ, పద్మావతి, లేండిగూడ, బోలాపటార్, జోడేఘాట్, టోకేన్‌మోవాడ్ లైన్‌పటార్ తదితర గ్రామాలు అగ్నిమాపక కేంద్రానికి 50 కిలో మీటర్లకు పైగా దూరంలో ఉన్నాయి. దీంతో అగ్నిమాపక వాహనం సంఘటన స్థలానికి వచ్చే వరకు గంట నుంచి రెండు గంటల సమయం పడుతుండడంతో ప్రమాదాలను నివారించడం, అదుపు చేయడం సాధ్యం కావడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఒకటి రెండు సంఘటనలు మినహా ఎక్కడా అగ్నిమాపక శకటం ఉపయోగపడలేదని చెబుతున్నారు. మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే మండలంలో పాటు జైనూర్, నార్నూర్, సిర్పూర్(యూ) మండలాల వాసులకు సైతం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఉన్నతాధికారులకు తెలియజేశాం..



సిర్పూర్(యూ), లింగాపూర్, జైనూర్, కెరమెరి నాలుగు మండలాలకు మధ్యలో కెరమెరి మండలం ఉంది. ఇక్కడ అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరగా ఉంటుంది. ఇదే విషయాన్ని చాలా సార్లు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. అధికారులు స్పందించాలి. – పెందోర్ మోతీరాం, మాజీ ఎంపీపీ, కెరమెరి

'ప్రజలకు సేవ చేయడమే ధ్యేయం



రవీంద్రనగర్‌లో అంబలి పంపిణీ చేస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని రవీంద్రనగర్‌లో వారసంతలో అంబలి పంపిణీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో గత కొన్ని సంవత్సరాలుగా అంబలి పంపిణీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీరోజు వేలాది లీటర్ల అంబలి పంపిణీ చేపడుతున్నామని, దీంతో వారసంతలకు వచ్చే ప్రజలు సేద తీరుతున్నారన్నారు. అంబలి పంపిణీ తమకు సంతృప్తినిస్తోందని విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. నాయకులు దుబ్బుల వెంకన్న, డోకె శ్రీనివాస్, టోమ్రె సురేశ్, గాట్ల కిష్టయ్య, జాబరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ అక్రమాలపై విచారణ జరపాలి



మాట్లాడుతున్న రైతులు

చింతలమానెపల్లి: మాజీ ఎంపీపీ దుబ్బుల నానయ్య అక్రమాలపై విచారణ జరిపించాలని పలువురు రైతులు కోరారు. మండల కేంద్రంలో గూడెం, బాలాజీ అనుకోడ, దిందా గ్రామాలకు చెందిన పలువురు రైతులు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మాజీ ఎంపీపీ తమ భూములను ఆక్రమించుకోవడంతో పాటు వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతు కామెర శంకరయ్య మాట్లాడుతూ బాలాజీ అనుకోడ గ్రామం శివారులోని తన భూమి అసైన్డ్ పట్టా అయినా దుబ్బుల నానయ్య అక్రమంగా పట్టా చేసుకున్నారన్నారు. మాజీ ఎంపీపీ బహిరంగంగా తమపై బెదిరింపులకు పాల్పడడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని కానీ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. గూడెం గ్రామానికి చెందిన డోకె మహేశ్ మాట్లాడుతూ గూడెం గ్రామంలోని తమ రెండెకరాల భూమిని ఆక్రమించుకునేందుకు నానయ్య ప్రయత్నించాడని తమపైనే పోలీసులతో అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశాడు. కొంపరి కొండయ్య మాట్లాడుతూ తమకున్న అసైన్డ్ భూమి పట్టాను తన పేరిట అక్రమంగా నమోదు చేయించుకున్నాడని ఆరోపించాడు. భూములను అక్రమంగా పట్టాలు చేసుకున్న దుబ్బుల నానయ్యతో పాటు అందుకు సహకరించిన అధికారులపై పోలీసు కేసు నమోదు చేసి విచారణ జరిపించాలని రైతులు డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులతో పాటు వారి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆత్మీయసభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: కోనేరు ఆత్మీయసభను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25న చింతలమానెపల్లి మండల కేంద్రంలో ఆత్మీయసభ నిర్వహిస్తున్నారని తెలిపారు. గత ఏడాదిన్నర కాలంలో సిర్పూర్ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై సభలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప విశ్లేషించనున్నట్లు తెలిపారు. మండలంలోని కోనేరు అభిమానులు, నాయకులు సభకు సకాలంలో హాజరు కావాలన్నారు. నాయకులు మెర్పల్లి బ్రహ్మయ్య, మధుకర్, మనీశ్, హన్మంతు, బాపు, రవీందర్‌గౌడ్, రమేశ్, శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రాకపోకలకు చెక్

- ఇనుప లోలెవల్ బోర్డు ఏర్పాటు



గ్రామస్తులు ఏర్పాటు చేసిన లోలెవల్ ఐరన్ బోర్డు

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా వెంకట్రావ్‌పేట్ గ్రామస్తులు శుక్రవారం చర్యలు చేపట్టారు. భారీ వాహనాలు ఈ రహదారిపై ప్రయాణించకుండా గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా భారీ ఇనుప లోలెవల్ బోర్డు ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లు, ఫోర్‌వీలర్లు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రతీరోజు రాత్రి, పగలు తేడాలేకుండా భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమవడమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట పొలాలకు సైతం నష్టం జరుగుతుందని గ్రామస్తులు ఆరోపించారు. రోడ్డు గుంతలమయంగా మారి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాపోతున్నారు.

గతంలో బోర్డు తొలగింపు..

వెంకట్రావ్‌పేట్–పోడ్సా అంతర్రాష్ట్ర రహదారి గుండా భారీ వాహనాలు రాకపోకలు కొనసాగించొద్దని గ్రామస్తులు పలుమార్లు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అధికారులు నచ్చజెప్పడం.. రోడ్డు మరమ్మతులు చేయించి ఇవ్వడంతో రాస్తారోకో విరమించుకున్నారు. అంతేకాకుండా గత రెండు నెలల క్రితం భారీ వాహనాల రాకపోకలు కొనసాగించకుండా గ్రామ శివారులో రోడ్డుకు అడ్డుగా ఇనుప లోలెవల్ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే రాత్రికిరాత్రే గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీల సహాయంతో బోర్డును తొలగించారు. దీంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు మరుసటి రోజు జేసీబీ సహాయంతో రోడ్డును తవ్వించి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. అయినప్పటికీ భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో శుక్రవారం మళ్లీ నూతన బోర్డును ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న అధికారులు

కౌటాల: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు మధ్యాహ్న భోజన వసతి కల్పిస్తారని తెలిపారు. రానున్న విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషయల్ ఇంటలిజెన్స్ ద్వారా వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. బడిబాట కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని తెలిపారు. సమావేశంలో పాఠశాల చైర్మన్ ఆదే మౌనిక, సీసీ విలాస్, ఉపాధ్యాయులు కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరెడ్డి

భీంపూర్: నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో పెస్టిసైడ్స్ యజమానులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లూజు సంచులలో ఉన్న విత్తనాలను రైతులకు అమ్మవద్దన్నారు. గుర్తింపు పొందిన విత్తన కేంద్రాల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రశీదును రైతులకు అందజేయాలని సూచించారు. తహసీల్దార్ నలందప్రియ, ఎస్సై పీర్‌సింగ్, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో తాత్కాలిక ప్రతిపాదికన పని చేసేందుకు బోధన, బోధనేతర సిబ్బంది కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. 2025 –26 విద్యా సంవత్సరానికి మాత్రమే ఒప్పందం ప్రతిపాదికన పని చేయాల్సి ఉంటుందన్నారు. గణితం, సామాన్య శాస్త్రం, తెలుగు, సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ శిక్షకుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 25వ తేదీ లోగా తమ దరఖాస్తులను సింగరేణి ఉన్నత పాఠశాలలో అందజేయాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ పూర్తి చేసిన వారికి, ఇంతకు ముందు సింగరేణి పాఠశాలలో పనిచేసిన అనుభవం ఉన్న వారికి, స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

తునికాకు కూలీకి గాయాలు

దహెగాం: మండలంలోని గెర్రె గ్రామానికి చెందిన తునికాకు కూలీ ధర్మరాజుల చిలుకయ్యకు జారి పడడంతో గాయాలయ్యాయి. బాధిత కూలీ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం తునికాకు సేకరణకు గ్రామ సమీపంలోని అడవికి వెళ్లాడు. తునికాకు కోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి పడడంతో కాలికి గాయాలు కాగా పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపాడు.

అసైన్డ్ పట్టాలను రెగ్యులరైజ్ చేయాలి



రైతుల నుంచి వినతిపత్రం తీసుకుంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

బెజ్జూర్: వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో రైతులకు ఇచ్చిన అసైన్మెంట్ పట్టాలు రెగ్యులరైజ్ చేయాలని మండలంలోని చిన్న సిద్దాపూర్, పాపన్నపేట గ్రామాల రైతులు కోరారు. శుక్రవారం పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో భూభారతి చట్టంపై అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండే విఠల్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో చిన్న సిద్దాపూర్, ఎలుకపల్లి, పాపన్నపేట తదితర గ్రామాల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అసైన్మెంట్ చేసి పట్టాలు ఇచ్చినప్పటికీ గత ప్రభుత్వం 2017లో వాటిని తొలగించిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త రెవెన్యూ చట్టం ద్వారా అప్పటి పట్టాలను రెగ్యులర్ చేస్తూ పట్టాలు ఇవ్వాలని కోరారు. పట్టాలు లేక బ్యాంకుల ద్వారా రుణాలు అందక, ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు నోచుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో ట్రాక్టర్ల ద్వారా దున్నుకున్న భూములను ఇప్పుడు పోడు భూములుగా చిత్రీకరించడంతో వాటిలో ట్రాక్టర్లు పెట్టనీయకుండా అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని మంత్రుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఇందుకు స్పందించిన మంత్రులు అటవీ, రెవెన్యూ శాఖల మధ్య నలుగుతున్న రైతులపై ఇరు శాఖలు జాయింట్ సర్వే నిర్వహించి సమస్య పరిష్కరిస్తామని తెలిపినట్లు తెలిపారు.

మార్కెట్‌యార్డులో రక్షణ కల్పించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రక్షణ కల్పించాలని రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి, కొండ రమేశ్ అన్నారు. ఇటీవల రైతులపై రాళ్లతో దాడి చేసిన నేపథ్యంలో శుక్రవారం మార్కెట్ యార్డును సందర్శించారు. వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రైతులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే దొంగలు దోచుకెళ్తున్నారని వాపోయారు. దొంగతనం చేయకుండా చూసిన ఇద్దరు రైతులపై రాళ్లతో దాడి చేశారన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా మార్కెట్ అధికారులు చూడాలని కోరారు. మే నెల చివరి వరకు జొన్న పంటను కొనుగోలు చేయాలని మార్కెట్ అధికారిని కోరారు.

కాంట్రాక్టు కార్మికుడి మృతి

కాగజ్‌నగర్ టౌన్: ఎస్పీఎం మిల్లులో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న జిమ్ముడి వేణు (35) అస్వస్థతకు గురై శుక్రవారం రాత్రి మృతి చెందాడు. పట్టణ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిర్యాని మండలంలోని గంభీరావుపేట గ్రామానికి చెందిన వేణు గత కొంతకాలంగా ఎస్పీఎంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. గురువారం రాత్రి విధుల్లోకి వెళ్లిన ఆయన తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. వెంటనే ఆయనను ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డెంగీ నిర్మూలనకు కృషి చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: డెంగీ నిర్మూలనకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డాక్టర్ వినోద్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ముందు డెంగీ నివారణ దినోత్సవం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగీ నిర్మూలన కోసం వైద్యులు, ఆశవర్కర్లు కృషి చేయాలన్నారు. వైద్య సిబ్బంది వాసుదేవ్, ఎంటీఎస్ అశోక్, ప్రశాంత్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.